వేం నరేందర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ (పీఏసీ)గా నియమితులైన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యసలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎమ్మెల్యే గాంధీని అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రఘునాథ్‌యాదవ్ పాల్గొన్నారు.


వేం నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షల వెల్లువ

హైదర్‌నగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ (పీఏసీ)గా నియమితులైన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, రాగం నాగేందర్‌యాదవ్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో నర్సింహగౌడ్, నిఖిల్, విమల, స్వప్న, ఫర్వీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

● శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డికాలనీకి చెందిన యాదమ్మ వైద్యచికిత్స కోసం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 2.50 లక్షల రూపాయల చెక్కును కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ఆమె కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఫతేనగర్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): మోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలందరూ ముందుకు తీసుకెళ్లాలని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. మంగళవారం ఫతేనగర్‌లో చేపట్టిన బీజేపీ అర్బన్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.


సభ్యత్వ నమోదు కార్డును అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

సభ్యత్వ నమోదు కోసం కష్టపడి పని చేయాలి

నిజాంపేట్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని బాచుపల్లి కమ్యూనిటీహాల్లో మేడ్చల్ అర్బన్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వ నమోదు తీసుకునేలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, జయశ్రీ, డాక్టర్ ప్రకాష్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, నరహరి, తేజా, విగ్నేష్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కొలన్ హన్మంత్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

దుండిగల్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. గాజులరామారం, శ్రీరామ్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎం.మహేష్, ఉపాధ్యక్షుడు ఎండీ అహ్మద్, ఎస్ ఖాజా, రమేష్‌గౌడ్‌లు హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ లాయక్, అజయ్, గఫార్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని వెన్నెలగడ్డ, బజరంగహిల్స్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా చెరువులోని గుర్రపుడెక్క, గుంతల రోడ్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి, సంజీవరెడ్డి, దుర్గయ్య ప్రతాప్, కృష్ణ పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న చంద్రారెడ్డి

భారీ వాహనాలను ఇష్టానుసారంగా పార్క్ చేయొద్దు

జీడిమెట్ల, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలో రోడ్ల పక్కన, ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా భారీ వాహనాలు పార్క్ చేస్తే కేసులు నమోదు చేస్తామని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. జీడిమెట్ల బస్‌డిపో సమీపంలోని గతి ట్రాన్స్‌పోర్టు సిబ్బంది ఇష్టానుసారంగా వాహనాలు పార్కు చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ట్రాఫిక్ సీఐ వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీకి స్థానిక నాయకులు లక్ష్మణ్, దుర్గారావు, భాస్కర్‌రెడ్డి, కూరపాటి ప్రభాకర్‌లు వినతిపత్రం అందజేశారు.


ట్రాఫిక్ ఏసీపీకి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

'పార్కు స్థలాలను హెచ్‌ఎండీఏకు బదిలీ చేయాలి'

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలోని పార్కుల కోసం కేటాయించిన స్థలాలను హెచ్‌ఎండీఏకు బదిలీ చేసేలా చూడాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. కేపీహెచ్‌బీ తొమ్మిదో ఫేజ్‌లోని 2.75 ఎకరాలు, మలేషియన్ టౌన్‌షిప్ వద్ద ఉన్న 5 ఎకరాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పార్కులుగా అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుందన్నారు. ఎన్నికలు రావడం ప్రస్తుతం ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయన్నారు. ఆ స్థలాలను హెచ్‌ఎండీఏకు బదిలీ చేస్తే ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధికి నోచుకుంటాయన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మచెరువు పక్కన జయానగర్‌కు కాలనీకి వెళ్లే మట్టి రోడ్డు చదును చేస్తున్న పనులను, ఉషాముళ్లపూడి రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ నుండి ఎల్లమ్మచెరువు అలుగు వరకు జరుగుతున్న వరదనీటి కాల్వ పనులను కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, మహదేవ్, కాంగ్రెస్ నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మోజెస్, షౌకత్‌అలీమున్నా, విష్ణు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


వరదనీటి కాల్వ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, అధికారులు

చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళి

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

చాకలి ఐలమ్మ పోరాట పటిమను మహిళలందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఫతేనగర్ ఈదమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి, ఈదమ్మ రజక సంఘం అధ్యక్షుడు సి.బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ అశోక్ ఎట్టయ్య, శంకర్, భాగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీకాలనీ: మూసాపేట్‌లోని ఐలమ్మ విగ్రహానికి మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావుతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు.


మూసాపేట్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఈదమ్మ రజక సంఘం సభ్యులు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్


షాపూర్‌నగర్: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, కమిటీ మండల నాయకులు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ, సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీలో గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాలలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు.

జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలో మండల ప్రాథమిక పాఠశాలను గ్లాండ్ ఫార్మా ఎండీ శ్రీనివాస్ సాధూ, మేనేజింగ్ ట్రస్టీ కె.రఘురామన్ సహకారాలతో సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన పాఠశాలను ప్రారంభించి మాట్లాడారు. పిల్లల బంగారు భవిష్యత్‌ను నిర్మించడంలో గురువుల పాత్ర ముఖ్యమని, పాఠశాలలో సదుపాయాలు ఎంతో ముఖ్యమని, అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చినప్పుడే ఆ పాఠశాల శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

జీడిమెట్ల: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కోరారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీలో గ్లాండ్ ఫార్మా యాజమాన్యం ఆధ్వర్యంలో దాదాపు 6 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా ఎండీ శ్రీనివాస్‌సాధు, మేనేజింగ్ ట్రస్టీ కె.రఘురామన్, మండల విద్యాధికారి హరిశ్చంద్ర, హెడ్‌మాస్టర్ యాదగిరి, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, అనిత పాల్గొన్నారు.


ప్రభుత్వ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్


తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోలీస్ జీవేందర్‌రెడ్డి, బెంబడి మల్లారెడ్డి, బౌరంపేటకు చెందిన నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు.
- నిజాంపేట్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి)

అదనపు కట్నం కోసం వేధింపులు..

గృహిణి ఆత్మహత్య

జీడిమెట్ల, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు పెట్టే బాధలు భరించలేక ఓ గృహిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రాంతంలోని సిర్‌సిల్క్‌కాలనీకి చెందిన బత్తిన ముత్యాలరావు కుమార్తె శిరీష(28) నాలుగు సంవత్సరాల క్రితం నానక్‌నామ్‌గూడలోని మైహోమ్ విహన్యాలో బ్యూటీషియన్ నేర్చుకుంది. ఆ సమయంలో బ్యూటీ పార్లర్‌లో పనిచేసే జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌కు చెందిన సూరజ్(28) పరిచయం అయ్యాడు. కొంతకాలం వారిద్దరు ప్రేమించుకుని పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించుకుని పెద్దలకు చెప్పారు. దీంతో శిరీష కుటుంబసభ్యులు పెళ్లికి అంగీకరించలేదు. చివరికి ఇరు పెద్దలు కూర్చుని 2023 సెప్టెంబర్ 2వ తేదీన వివాహం జరపించారు. పెళ్లి సమయంలో 2 లక్షల నగదు, 5 తులాల బంగారం, ఇతర సామగ్రి కట్నంగా ఇచ్చారు. పిల్లలు పుట్టిన తర్వాత మరో 2 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. దీంతో అదనపు కట్నం కోసం శిరీషను భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేయడంతో ఈనెల 10వతేదీన మధ్యాహ్నం ఇంట్లోని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.


ఎంపీ ఆర్.కృష్ణయ్యను సన్మానించిన సప్పిడి భాస్కర్ తదితరులు

ఆర్.కృష్ణయ్యను కలిసిన టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు

బాలానగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కూకట్‌పల్లి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షుడు సప్పిడి భాస్కర్ ఆధ్వర్యంలో కృష్ణయ్య కలిసి శాలువాతో సత్కరించారు. బీసీ హక్కుల కోసం తామంతా కృష్ణయ్య వెంటే ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏ.శ్రీధర్‌గౌడ్, సప్పిడివినీత్, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు

గచ్చిబౌలి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బుధవారం పెద్దఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నామని బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

దర్శన్‌స్కూల్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధి అంజయ్యనగర్‌లోని దర్శన్ స్కూల్‌పై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు మంగళవారం బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. స్కూలు భవనం చెరువుకు పక్కనే 5 అంతస్థుల్లో నిర్మించారని, పిల్లలకు ఆడుకోడానికి ఆటస్థలం తదితర సదుపాయాలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల పాఠశాలలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలు ఆర్పేందుకు ఫైర్ సిబ్బందికి చాలా ఇబ్బంది కల్గిందని వారు తహసీల్దార్‌కు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు బ్యాగరి నర్సింహ్మయ, ఇన్‌చార్జి మధుకర్ మాదిగ, పవన్, అనిల్ సంతోష్ తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.


తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదుపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు


దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రమాణం చేయిస్తున్న నూతన కమిటీ సభ్యులు

దాసాంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

బాలానగర్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): దాసాంజనేయ ఆలయ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎస్.ప్రవీణ్‌కుమార్ సభ్యులుగా జగదీష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, సుగుణ, ఏ.మహేందర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఎండోమెంట్ ఈవో అంజయ్య, ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌తో కలిసి నూతనంగా ఎన్నికైన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్‌పటేల్, మోహన్‌రెడ్డి, శివచౌదరి బచ్చుమల్లి పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ ముంబాయిలో నివసిస్తున్న నాగనాథ్ నాందేవ్(37) క్యాటరింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో మనస్థాపానికి గురైన అతడు హైదరాబాద్ వచ్చాడు. మూడు రోజులపాటు కాచిగూడ రైల్వే స్టేషన్‌లోనే ఉన్నాడు. సోమవారం రాత్రి ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వద్ద ఎంఎంటీఎస్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


జగద్గిరిగుట్టలో నిర్వహించిన వినాయక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, స్థానిక కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, నాయకులు జైహింద్
- జీడిమెట్ల ఆంధ్రజ్యోతి

13 నుంచి వైర్‌మన్, సూపర్‌వైజర్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): వైర్‌మన్, సూపర్‌వైజరీ పరీక్ష రాసే ప్రైవేట్ సెక్టార్ ఎలక్ట్రీషియన్లకు ఈనెల 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు సభ్యులు నేమాల బెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం వైర్‌మన్, సూపర్‌వైజరీ పరీక్షలను తెలంగాణలో స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తోందని, ఈ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు పదిహేను ఏళ్లుగా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో ఈ ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7989349899, 9848258202లలో సంప్రదించాలని సూచించారు.

నిథిమ్‌లో టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో టూరిజం కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత కళాశాలగా కొనసాగుతున్న నిథిమ్‌లో ఇంటర్ పాసైన విద్యార్థులు బీఎస్సీ, బీబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ అడ్మిషన్లకు, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు ఎంబీఏ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తుందని చెప్పారు. అడ్మిషన్, ఇతర వివరాలకు 95537 00034, 95537 00035లలో సంప్రదించాలని సూచించారు.

ఔషధ నియంత్రణ సంస్థ దాడులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో 1వ అంతస్తులో అఖిల్ లైఫ్ సైన్సెస్ పేరుతో ఏర్పాటు చేసిన మందుల తయారీ యూనిట్‌పై ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అఖిల్ లైఫ్ సైన్సెస్ 'గ్లోకోరిల్ కాఫ్ సిరప్' అనుమతి లేకుండా, లైసెన్స్ పొందకుండా మందులను తయారీ చేస్తున్నట్లు గుర్తించినట్లు ఔషధ నియంత్రణ సంస్థ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడుల్లో లక్ష రూపాయల విలువైన నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా ఈ మందులను తయారీ చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అనుమతులు లేకుండా ఐదంతస్తులు

పనులు చేస్తుండగా కార్మికుడికి విద్యుదాఘాతం

దుండిగల్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్ చౌరస్తాలో జిన్నారం మండలం, గడ్డ పోతారానికి చెందిన ఓ వ్యక్తి 180 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఐదంతస్తుల భవనం నిర్మాణం చేపట్టాడు. ఆ భవన నిర్మాణం చివరి దశలో ఉంది. భవనం చుట్టూ ప్లాస్టింగ్ చేయడం కోసం మంగళవారం గడ్డపోతారానికి చెందిన కుమ్మరి విఠల్(45) గోవా కర్రలు కడుతున్నాడు. ఈ క్రమంలో భవనానికి అనుకొని వెళుతున్న విద్యుత్ తీగలను గమనించక పోవడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. తోటి కార్మికులు వెంటనే సూరారంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాగిల్లాపూర్‌లో నిర్మిస్తున్న ఐదు అంతస్తుల భవనం

● **అనుమతులు లేని నిర్మాణాలు**

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గాగిల్లాపూర్, ఇతర ప్రాంతాల్లో మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండడంతో కొత్త భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి. ఒక ప్రక్క ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నా అనుమతులు లేని భవనాలు వెలుస్తూనే ఉన్నాయి. ఈ నిర్మాణ విషయంలో మాత్రం మున్సిపల్ అధికారులు , సిబ్బంది ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో వారికే తెలియాలి.